# తెలుగు భాషా దినోత్సవము

గిడుగు రామమూర్తి పుట్టిన రోజు ఆగష్టు 29 ని తెలుగు భాషా దినోత్సవముగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, ప్రజలు పాటిస్తున్నారు. ఈ రోజు సభలు జరిపి, పదోతరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో తెలుగులో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలని, తెలుగు భాషా చైతన్య సమితి లాంటి స్వచ్ఛంధ సంస్థలు అందచేస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు వినియోగం పెంచడానికి కృషి చేస్తున్నారు.

ప్రపంచీకరణ వలన పిల్లలను ఇంగ్లీషు మాధ్యమములో చదివించటానికి ఎక్కువ మంది తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతము కేవలం 27% మంది పిల్లలు మాత్రమే తెలుగు మాధ్యమములో చదువుతున్నారని వినికిడి మరియు లెక్కలు కూడా తెలియ జెప్పుతున్నాయి. ప్రత్యేకించి టెలివిజన్ మాధ్యమాలలో పరభాష పదాల వాడుక పెరిగిపోతున్నది. ఇలాగే కొనసాగితే తెలుగు వాడుకలో తగ్గిపోయి, మృతభాషగా మారే ప్రమాదమున్నది. ఐక్యరాజ్యసమితి విద్య సాంస్కృతిక సంస్థ 1999/2002-12 తీర్మానంలో ప్రపంచంలోని 6000 భాషలలో 3000 కాలగర్భంలో కలసిపోగా, 2025 నాటికి భారతదేశంలో కేవలం 5 భాషలు (హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళం, మళయాళం)మిగులుతాయని పేర్కొన్నారు.

- ***అ' = అమ్మ అంటే ధర్మము నకు, ఆ = ఆవు ఉంటే (పాడి పంటలు) అర్ధము నకు, ఇ = ఇల్లు (సంసారము)*** కామము ***మరియు*** ఈ = ఈశ్వరుడు (భగవంతుడు) **మోక్షము** నకు ప్రతీక. ఇటువంటి చక్కని తెలుగు అక్షరాలు అర్థవంతముగా బడిలో గురువులు పిల్లలకు నేర్పిస్తారు.
- "మేకతోకకు మేక, తోకమేకకు తోక, తోకమేకాతోక తోకమేక ...... మేకకొక తోక, మెక మేక తోక తోక ......."
- నరసింహ కృష్ణ రాయని
  కరమరుదగు కీర్తి యొప్పె కరిభిత్ గిరిభిత్
  కరి కరిభిత్ గిరి గిరిభిత్
  కరిభిత్ గిరిభి త్తురంగ కమనీయంబై !

- సిరి గల వానికి జెల్లును
  తరుణులు పదియారు వేలు తగ పెండ్లాడన్
  తిరిపెమున కిద్దరాండ్రా ?
  పరమేశా గంగ విడుము పార్వతి చాలున్ !!
-
- తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను
  తెలుగు వల్లభుండ తెలుగొకండ
  ఎల్లనృపులు గొలువ ఎరుగవే బాసాడి
  దేశ భాషలందు తెలుగు లెస్స

## తెలుగు భాష - చారిత్రక నేపథ్యం

నేటి తెలుగు వెలుగు నీడల సమ్మేళనమై , ఆనంద విషాదాల సమ్మిశ్రితమై ఉన్నదనడం ఒక చేదు నిజం , ఒక తియ్యటి సత్యం . దక్షిణ ఆసియాలోని 24 ద్రావిడ భాషల్లో అధిక సం ఖ్యాకుల అమ్మ భాషైన తెలుగు, శాతవాహనుల కాలం నుండి సాంస్కృతిక చరిత్ర గల తెలుగు , తూర్పు చాళుక్యుల కాలంలో పాలనా భాషైన తెలుగు, జాతీయ భాషైన హిందీకి ద్వితీయ స్థానంలో నిలిచిన తెలుగు , ప్రపంచ భాషల్లో 16వ దిగా లెక్కింపబడిన తెలుగు, రాష్ట్రంలోనేకాదు దేశంలోనే అధికార భాష గా అలరారవలసిన తెలుగు నేడు పురోగతిలో తిరోగతిని చూస్తోందా ? వెలుగు కిరణాల వెనుక తరగని క్రీనీడల్ని చవిచూస్తోందా ? మహోన్నత కీర్తి శిఖరాల నుండి శిథిలాల నిశీధిలోకి జారిపోతోందా ? ఈ సందేహ త్రయ నివృత్తికి గతంలోకి ఒక్కసారి దృష్టి సారించి , వర్తమానంలోకి చూపు నిలిపి ఈ కాల పు తెలుగు గురించి తెలుసుకుందాం.

మన మాతృభాషకీనాడు ఆంధ్రం , తెనుగు, తెలుగు అనే మూడు పేర్లూ ప్రాచుర్యంలో ఉన్నాయి . ఆంధ్రులు ఆగంతకులైన ఆర్యులకన్నా ఈ దేశ ఆదిమవాసులన్నది ఒక చారిత్రక సత్యం . వీరుత్తరార్యావర్తం నుండి దక్షిణాపథానికి వలసవచ్చి , రాజ్యాన్ని స్థాపించుకున్నా రు. మౌర్యుల తర్వాత చతురంగ బలసంపన్నులని మెగస్తనీసు; అందమైనవారు, విహార ప్రియులని ఉద్యోతనుడు వీరినభివర్ణించి ఉన్నారు. ఆంధ్రుల బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు వివిధ శిలాశాసనాలు , బౌద్ధ - సంస్కృత వాఙ్మయాలు అద్దం పడుతున్నాయి. వేల సంవత్సరాలుగా, విశ్వవ్యాప్తంగా కీర్తి బావుటాల నెగురవేసిన తెలుగుజాతి తన చారిత్రక నేపథ్యాన్ని హృదయాలకు హత్తుకొని ఇంకా ముమ్ముందుకి సాగిపోవాలి . సూర్యుడు - వెలుగు, చంద్రుడు - వెన్నెల, తెలుగూ - తెలుగువాడు వేర్వేరు కాదు, కాకూడదని, ''తెలుగు జాతి నిండుగ వెలుగు జాతి'' ఉన్నట్లే - తెలుగు భాష నిండుగ వెలగు భాష కావాల ని ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ ఈ కాలపు తెలుగును పరిశీలిద్దాం.